# సాక్షి
## కుమురం భీం

మంగళవారం : 9 : మే : 2023






**పులి కోసం జింకల పునరుత్పత్తి**
జన్నారం అటవీ డివిజన్‌లో రూ.83 లక్షలతో జింకల పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో 40 జింకలను తీసుకురానున్నారు. 8లో▸



**బాలికపై లైంగిక దాడి** 10లో▸
కాగజ్‌నగర్ మండలంలోని ఓ గ్రామంలో ఏడేళ్ల బాలికపై 57 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. చికిత్స కోసం బాలికను పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

గరిష్టం/కనిష్టం
**40.9 /28.6**

**వాతావరణం**
ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఆకాశంలో కొంత మేర మేఘాలు ఉంటాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల వర్షం పడొచ్చు.

## న్యూస్‌రీల్

### జిల్లా క్రీడాకారుల ప్రతిభ



మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న అలేఖ్య

**రెబ్బెన(ఆసిఫాబాద్):** తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 7వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన యోగా జడ్జీస్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో రెబ్బెన మండలం గోలేటికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ తెలిపారు. ఆన్‌లైన్ ప్రోగ్రాంలో రాణించిన గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన కేసరి అలేఖ్య, పత్తెం అలేఖ్యకు సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, ఉపాధ్యక్షుడు రామచంద్రరావు, సంయుక్త కార్యదర్శి తోట సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

### 10లోగా ఫీజు చెల్లించాలి

**కాగజ్‌నగర్‌టౌన్:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్ తీసుకున్న రెగ్యులర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఈ నెల 10లోగా ఫీజులు చెల్లించాలని కోఆర్డినేటర్ తూడురు దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సెమిస్టర్– 6, సెమిస్టర్ 2, 4 విద్యార్థులు ఫీజులను 12 లోగా ఆన్‌లైన్‌లో, అదనంగా ప్రాక్టికల్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98663 98678 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### నేటి నుంచి మియాపూర్‌కు బస్సు సర్వీస్

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం ఉదయం 3.30 గంటలకు హైదరాబాద్‌లోని మియాపూర్ వరకు సూపర్‌లగ్జరీ బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి మందమర్రి, బీజోన్ మీదుగా మియాపూర్‌కు వెళ్తుందన్నారు. ఉదయం 10.45 గంటలకు జేబీఎస్ బస్టాండ్‌కు, అక్కడి నుంచి 11.30 గంటలకు మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఎస్సీ వర్గీకరణపై స్పందించకపోవడం సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** హైదరాబాద్‌లో బీఎస్పీ నిర్వహించిన బహిరంగ సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఎస్సీల వర్గీకరణపై స్పందించకపోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కేశవ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. బీఎస్పీ ఇప్పటికైనా వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, లక్ష్మణ్, లచ్చన్న, సాగర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్లను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రైవేట్ డ్రైవర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో డిపో ప్రైవేట్ డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, నాయకులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం టీఎస్ ఆర్టీసీ డిపో ప్రైవేట్ డ్రైవర్ల యూనియన్ ఆసిఫాబాద్ డిపో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఉపేందర్, అధ్యక్షుడిగా మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా దివాకర్, పిడుగు శంకర్, ఉపాధ్యక్షులుగా సోమ విజయ్‌కుమార్, షఫీక్, ప్రధాన కార్యదర్శిగా తేజ, సహాయ కార్యదర్శిగా గాజుల సాంబశివ ప్రసాద్, కోశాధికారిగా సాయికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# హరిత సన్నద్ధం



దహెగాంలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమానికి మొక్కల పెంపకం
- జిల్లా వ్యాప్తంగా 335 నర్సరీలు ఏర్పాటు
- జూన్ నుంచి మొక్కలు నాటేలా ప్రణాళికలు
- వేసవి నేపథ్యంలో ప్రత్యేక సంరక్షణ చర్యలు

**దహెగాం(సిర్పూర్):** 'ప్రతీ మొక్క బతకాలి.. పచ్చదనం పెరగాలి.. క్షీణించిన అడవులు మళ్లీ దట్టంగా మారాలి..' అనే లక్ష్యం ప్రారంభమైన తెలంగాణకు హరితహారం కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. తొమ్మిదో విడత కార్యక్రమంలో 32 లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రతీ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేసి అవసరమైన మొక్కల పెంపకం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు అవసరమైన పూలు, పండ్ల మొక్కలతోపాటు రోడ్లు, కార్యాలయాల్లో నాటేందుకు నీడనిచ్చే మొక్కలు పెంచుతున్నారు.

**32 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం..**
ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో 32 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 50 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, పాఠశాల ఆవరణలు, రోడ్లకిరువైపులా రెండు, మూడు వరసల్లో నాటడం, చెరువు గట్లు, చెరువు శిఖం, కెనాల్స్ పై నిర్ణయించిన మేరకు మొక్కలు నాటనున్నారు. ప్రజలు ఇళ్లలో పెంచుకునే విధంగా గ్రామాల్లో ప్రజలకు పూలు, పండ్ల మొక్కలు అందించనున్నారు. ప్రస్తుతం నర్సరీల్లో 80 శాతం మొక్కలను పెంచుతున్నారు. మిగిలిన 20 శాతం ఖాళీ బ్యాగుల్లో మునగ, టికోమా లాంటి మొక్కలు పెంచుతామని అధికారులు చెబుతున్నారు.

**ప్రతీ పంచాయతీకో నర్సరీ..**
వర్షాకాలం ప్రారంభమైన వెంటనే జిల్లాలో తొమ్మిదో విడత హరితహారం కింద మొక్కలు నాటనున్నారు. ఒకటి, రెండు వర్షాలు పడిన తర్వాత అవసరమైన చోట విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 335 నర్సరీలు ఏర్పాటు చేశారు. వర్షాకాలం నాటికి మొక్కలు సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్‌లో వర్షాలు పడడంతో మొక్కలు బాగానే ఉన్నాయి. ఎండల నుంచి రక్షణకు నర్సరీల్లో అధికారులు చలువ పందిర్లు(షేడ్ నెట్లు)ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మొక్కలను నిత్యం నీళ్లు పట్టడం, కలుపు తీయడం వంటి పనులు చేపట్టేందుకు వన సేవకులను నియమించారు. వీరికి రోజుకు రూ.275 కూలి చెల్లిస్తున్నారు.

**మొక్కలు సిద్ధం చేస్తున్నాం**
హరితహారం కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా 335 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. వర్షాకాలం ప్రారంభం కాగానే నాటేందుకు వీలుగా సిద్ధం చేస్తున్నాం. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 32 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఒక్కో నర్సరీలో 30 వేల నుంచి 50 వేల వరకు పెంచుతున్నాం. వేసవి దృష్ట్యా గ్రీన్ మ్యాట్లతో పందిర్లు వేశాం. ఖాళీ బ్యాగులు ఉంటే మునగ, టికోమా మొక్కలను పెంచాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించాం.
– సురేందర్, డీఆర్‌డీవో

# దరఖాస్తులు పరిష్కరిస్తాం



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- కలెక్టరేట్‌లో ప్రజావాణి

**ఆసిఫాబాద్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి వివిధ మండలాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెండేళ్లుగా వస్తున్న పింఛన్ నిలిచిపోయిందని, వెంటనే పునరుద్ధరించాలని పెంచికల్‌పేట్ మండలం బొంబాయి గూడకు చెందిన చప్పిడి అన్నయ్య కోరాడు. వికలాంగురాలునైన తనకు గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చంతపూరి మధునబాయి దరఖాస్తు చేసుకుంది. గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించాలని ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్‌కు చెందిన వనమాల ప్రణీత, వరదలగూడెంకు చెందిన ఎనగంటి మమత దరఖాస్తు చేసుకున్నారు. నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయిన ఇళ్లకు పరిహారం ఇప్పించాలని వాంకిడి మండలం మోహగాం గ్రామానికి చెందిన షేక్ అయ్యూబ్, ఎస్కే షబ్రీ, తండ్రి పేరుతో గల ఇంటి ముందు స్థలానికి పరిహారం ఇప్పించాలని పోచమ్మ బస్తీకి చెందిన బండాయి ఆంజనేయులుగౌడ్ కలెక్టర్‌ను కోరారు. కుమురంభీం జిల్లాకు చెందిన తనకు ఆసిఫాబాద్‌లోని కేజీబీవీలో వంట మనిషిగా అవకాశం కల్పించాలని మంచిర్యాల జిల్లా తాండూరులోని కేజీబీవీలో సహాయ వంట మనిషిగా పనిచేస్తున్న విజయలక్ష్మి వేడుకుంది. వితంతు పింఛన్ మంజూరు చేయాలని చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన తోడెల్లి శోభారాణి దరఖాస్తు చేసుకుంది. వికలాంగ ధ్రువీకరణ పత్రంలో కన్నుకు బదులుగా చెవిగా నమోదైందని, వెంటనే పింఛన్ మంజూరు చేయాలని పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడ గ్రామానికి చెందిన అనసూయ అర్జీ సమర్పించారు.

# నకిలీ విత్తనాలను నియంత్రించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో సమీక్షా సమావేశం

**ఆసిఫాబాద్:** నకిలీ విత్తనాలను నియంత్రించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులతో నకిలీ విత్తనాల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పత్తి సాగు అధికంగా ఉండడంతో రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి, నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలు, సరఫరాపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్సై, వ్యవసాయ శాఖ అధికారులతో బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాలు సరఫరా జరిగే అవకాశం ఉందని, దీనిని అడ్డుకోవాలన్నారు. తనిఖీ కేంద్రాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అనుమతి కలిగిన కంపెనీల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గణితంపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**ఆసిఫాబాద్‌రూరల్:** విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 5 నుంచి 8 వరకు సరోజిని స్మార్ట్ లెర్నింగ్ నిర్వాహకుడు మురహరి సహాయంతో నిర్వహించిన ఉచిత వేద గణితం తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంచి అవకాశాలు ఉంటాయన్నారు. 60 మంది విద్యార్థులకు తక్కువ సమయంలో గణిత సమస్యలు సాధించేలా శిక్షణ అందించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు, కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాకేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

**కెరమెరి(ఆసిఫాబాద్):** జీవితంలో లక్ష్య సాధనకు చదువు ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండలంలోని గోయగాం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన లైబ్రరీ, స్టడీ సెంటర్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిరుద్యోగులతో మాట్లాడారు.

# శ్రమదానంతో జేపీఎస్‌ల నిరసన



కలెక్టరేట్ ఆవరణలో మొక్కకు గుంత తీసి నీళ్లు పడుతున్న జేపీఎస్‌లు

**ఆసిఫాబాద్‌అర్బన్:** క్రమబద్ధీకరణ కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ప్రతిరోజూ వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించి శ్రమదానం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 11 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు తన్నీరు వెంకటేశ్, రాజేశ్వరి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**సాయంత్రం 5గంటల్లోగా విధుల్లో చేరాలి**
**ఆసిఫాబాద్:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరని పక్షంలో విధుల నుంచి తొలగిస్తామని కలెక్టర్ హేమంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రిమెంట్‌ను ఉల్లంఘిస్తూ చట్టవిరుద్ధంగా జేపీఎస్‌లు సమ్మె చేయడంతో అన్ని హక్కులు కోల్పోతారని పేర్కొన్నారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరేందుకు చివరి అవకాశం కల్పిస్తున్నామని, విధుల్లో చేరని పక్షంలో సేవలు రద్దు చేస్తామని తెలిపారు.

# సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ర్యాలీగా వస్తున్న పంగిడిమాదర గ్రామస్తులు

**ఆసిఫాబాద్:** సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ తిర్యాణి మండలం పంగిడిమాదర గ్రామస్తులు ఆందోళన బాటపట్టారు. గ్రామం నుంచి సోమవారం కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంగిడిమాదర, భీంజీగూడ గ్రామాల్లోని సెల్ టవర్‌ను వెంటనే ప్రారంభించాలని, రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులివ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, గ్రామాలకు రోడ్లు, సైడ్ డ్రైయిన్లు నిర్మించాలని, సీహెచ్‌సీ సెంటర్ పూర్తి చేయాలన్నారు. చెరువులకు కాల్వల నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పంగిడిమాదర గ్రామ సమస్యల పోరాట కమిటీ అధ్యక్షుడు పెందోర్ మధుకర్, ఉపాధ్యక్షుడు మడావి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మడావి బొజ్జిరావు, సహాయ కార్యదర్శి ఆత్రం వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి గురించి గంట చెప్పినా ఒడువది!

- బెల్లంపల్లికి బంగారు భవిష్యత్తు!
- రాబోయే రోజుల్లో మరిన్ని ఐటీ కంపెనీలు
- ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం



సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**బెల్లంపల్లి:** తెలంగాణ సాధించుకున్నాక.. సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గంట సేపు చెప్పినా ఒడువదని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి సోమవారం బెల్లంపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.114.89 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పట్టణంలోని ఏఎంసీ మైదానంలో పట్టణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే చిన్నయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో బెల్లంపల్లి వంటి పట్టణాల్లో అంత్యక్రియలకు వెళ్తే స్నానాలకు కరెంట్ ఇవ్వాలని అధికారులను వేడుకునే పరిస్థితి ఉండేదన్నారు. నాడు కరెంట్ ఉంటే వార్త అని,నేడు కరెంటు పోతే వార్త అని అన్నారు. వేసవిలో ప్రజాప్రతినిధులు గ్రామాలకు వెళ్తే మహిళలు బిందెలతో ఎదురొచ్చేవారన్నారు. నేడు ఎర్రటి ఎండలోనూ చెరువులు నిండు కుండలా ఉన్నాయని తెలిపారు. ఒకప్పుడు విత్తనాలు, రుణాలు దొరికేవి కాదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో 14లక్షల మంది పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కేసీఆర్ మేనమామలా రూ.1,00,116 ఇచ్చారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సింగరేణిలో కొత్తగా 19వేల మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. కార్మికుల రిటైర్మెంట్ వయసు 61 ఏళ్లకు పెంచామన్నారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ.10 లక్షల వడ్డీలేని రుణం ఇస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి గురించి ఎంత చెప్పినా ఒడవదని పేర్కొన్నారు.

**పేరులో చిన్నయ్య.. పనుల్లో పెద్దయ్య..**
ఎమ్మెల్యే చిన్నయ్యపై మంత్రి కేటీఆర్ ప్రశంసల జల్లు కురిపించారు. పేరు చిన్నయ్య అయినా.. పనుల్లో మాత్రం పెద్దయ్య అని ప్రశంసించారు. సీఎం కేసీఆర్‌ను చిన్నయ్య పలుమార్లు కలిసి సింగరేణి స్థలాల్లో ఇళ్లపట్టాల కోసం పట్టుబట్టి సాధించుకున్నారని పేర్కొన్నారు. మంచి నాయకత్వాన్ని బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు వదులుకోవద్దని సూచించారు. బీఆర్‌ఎస్‌ను మూడోసారి గెలిపించి బెల్లంపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

**అభివృద్ధి నిధుల కోసం అభ్యర్థన...**
ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి తగినన్ని నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌ను అభ్యర్థించారు. స్థానికంగా బొగ్గు గనులు మూతపడటంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని తెలిపారు. యువకుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. వేమనపల్లి, నెన్నెల, కాసిపేట, తాండూర్ మండలాల పరిధిలో రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు రూ.50 కోట్లు, బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేకంగా మరో రూ.50కోట్లు మంజూరు చేయాలని కోరారు. బెల్లపల్లి నియోజకవర్గానికి అదనంగా మరో 5 వేల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన కేటీఆర్ బెల్లంపల్లి మున్సిపాలిటీకి తక్షణం రూ.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

**నెరవేరిన పుర ప్రజల కల..**
బెల్లంపల్లి పట్టణ ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఇళ్ల పట్టాలకల ఎట్టకేలకు నెరవేరింది. ప్రభుత్వ, సింగరేణి లీజు భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి మంత్రులు పట్టాలు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఏడు వేల ఇళ్లకు, మరో మూడు వేల ఎస్‌ఆర్టీ క్వాటర్లకు పట్టాలు ఇస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ఏఎంసీ మైదానంలో 30 మందికి పట్టాలు పంపిణీ చేశారు. మిగతావి ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు భాగ్యలక్ష్మి, కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ క్రిశాంక్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు సక్కు, రేఖానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్ , బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి**
**కాసిపేట:** ఓరియంట్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఓరియంట్ యాజమాన్యానికి సూచించారు. కాసిపేట మండలం దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ నాలుగో ప్లాంటు విస్తరణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కంపెనీ అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు యాజమాన్యం చొరవ చూపాలని సూచించారు. కంపెనీ విస్తరణకు సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని పేర్కొన్నారు. కంపెనీ విస్తరణతో కొత్తగా 4 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. దేవాపూర్ గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. సీఎస్‌ఆర్ నిధులతో ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, ఆత్రం సక్కు, ఓరియంట్ కంపెనీ ఎండీ కేత్రపాల్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, టీఎస్‌ఎండీసీ చైర్మన్ మన్నె క్రిశాంక్, వైస్‌చైర్మన్ అండ్ ఎండీ మల్సూర్, సర్పంచ్ మడావి తిరుమల, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పిడుగుపాటుకు పశువుల కొట్టం దగ్ధం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

జన్నారం: మండలంలోని హాస్టల్ తండాలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు పశువుల కొట్టం, గడ్డివాము దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలార్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు భుక్యా చందునాయక్ నాయక్ తెలిపాడు.

### గేట్ తలపై పడి కార్మికుడికి తీవ్రగాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో సీసీఆర్ ఓబీ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు అట్కపురం రాజయ్యకు తలపై గేటు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం సెలవు అయినప్పటికి ఓ పని మీద క్యాంపునకు వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. తాళ్లపల్లి వైపు ఉన్న కంపెనీ ఎస్అండ్‌పీసీ కాపలా గేట్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది అతన్ని ఆగాలని సూచించే క్రమంలో సరిగ్గా ఆయన మధ్యలో వచ్చిన తర్వాత గేట్ వేశారు. దీంతో అతని తలకు తీవ్రగాయమైంది. సిబ్బంది సింగరేణికి, 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. గంట తర్వాత 108, ఆపై కంపెనీ అంబులెన్స్ వచ్చాయి. కంపెనీ అంబులెన్సులో ఆయన్ను మంచిర్యాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి రిఫర్ చేశారు. మంచిర్యాలలో ప్రైవేటు ఆసుపత్రి వద్ద టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు రేగుంట సునిల్, శ్రీపతి, పవన్‌కుమార్, రమేశ్‌లు రాజయ్యను పరామర్శించారు.

### రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (30) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక రైల్వేస్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫాం చివరన సోమవారం దానపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఎడమ చేతిపై ఆరాధన అని పచ్చబొట్టుతో రాసి ఉంది. ఎరుపు రంగు ఫుల్ టీషర్ట్, ఖాకీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురిగదిలో మృతదేహం భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు జీఆర్పీ పోలీసులు 8328512176, 9490871784 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.



# పులి కోసం.. జింకల పునరుత్పత్తి

- జన్నారంలో రూ.83 లక్షలతో కేంద్రం ఏర్పాటు
- చివరి దశలో పనులు
- జూన్ నుంచి ప్రారంభం



పునరావాస కేంద్రంలో జింకలు



పనులు పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో మాధవరావు

జన్నారం:జాతీయ జంతువు పులి. అయితే పులి వేటకు సరిపడా వన్యప్రాణులు లేకపోవడంతో జింకల సంఖ్య పెంచాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జింకల పునరుత్పత్తి కేంద్రం నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి జింకలను అవసరమైన చోటకు తరలిస్తారు.

**పదేళ్లయినా పత్తాలేని పులి..**

కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేసి సుమారుగా పదేళ్లు అవుతోంది. కానీ, ఇప్పటి వరకు ఒక్క పులిని కూడా ఇందులో గుర్తించలేదు. పులులు రాకపోవడం, వచ్చినా స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. అధికారుల లెక్కల ప్రకారం టైగర్‌జోన్‌లో ఒక చదరపు కిలోమీటర్‌కు అన్ని రకాల జంతువులు కలిపి 40 నుంచి 50 వరకు ఉండాలి. కానీ కవ్వాల్ టైగర్ జోన్‌లో మాత్రం 20 మాత్రమే ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పులి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలంటే వన్యప్రాణుల సంతతి పెంచాల్సిన అవసరం ఉన్నందున ఆదిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌తోపాటు వివిధ టైగర్‌జోన్‌లో పులి ఆవాసాలున్న ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య తక్కువగా ఉంటే అవసరమున్న చోటకు జింకలను తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మొదటిసారిగా జన్నారం అటవి డివిజన్‌లో జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని(ఎన్సిటివ్ కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్) ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.1.40 కోట్లతో ప్రతిపాదనలు..**

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ మల్యాల అడవుల్లో ఏర్పాటు చేసే జింకల పునరుత్పత్తి కేంద్రం కోసం అధికారులు రూ.1.40 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. కానీ కంపా(కాంపెన్సేషరీ ఎన్‌ఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్) నుంచి రూ.83 లక్షలు మాత్రమే మంజూరు చేశారు. పనుల కోసం గతేడాది మార్చి 25న టెండర్ నిర్వహించారు.

**ఐదు ఆడ జింకలకు ఒక మగ జింక..**

కన్హా టైగర్ రిజర్వ్‌జోన్‌లో మాదిరిగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న జింకల పునరుత్పత్తి కేంద్రంలో ఒక మగ జింక, ఐదు ఆడ జింకల చొప్పున ఉంచుతారు. మొదటి దశలో 40 జింకలను తీసుకువచ్చి ఇందులో ఉంచుతారు. వాటి సంతానం పెంపుదల కోసం పునరుత్పత్తి కేంద్రంలో అన్ని సౌకార్యాలు ఏర్పాటు చేస్తారు. సహజంగా వచ్చే గడ్డి, నీటి సౌకర్యం కోసం సోలార్ పంపు, కుంటను నిర్మించారు. ఇందులో వన్యప్రాణులు సహజంగా పెరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులకోసారి ఆహారం అందిస్తారు.

**40 హెక్టార్లలో ఏర్పాటు..**

సుమారుగా 40 హెక్టర్ల పరిధిలో జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రెండు దశలుంటాయి. మొదటి ఇందుకు 40 హెక్టార్లలో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అందులో అన్ని వసతులు కల్పిస్తారు. మరో ఐదు హెక్టర్లు చిన్న ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేస్తారు. పునరుత్పత్తి అయి వాటి సంఖ్య పెరగగానే వాటిని అవసరమైన చోటికి తరలించే ఏర్పాట్లు చేస్తారు. అయితే చిన్న ఎన్‌క్లోజర్ నిర్మాణం వాటికి ఇబ్బంది లేని విధంగా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**జూన్‌లో ప్రారంభం..**

జింకల పునరుత్పత్తి కేంద్రం పూర్తి కావస్తున్నందున జూన్‌లో జింకలను ఇక్కడికి తీసుకువచ్చే యోచనలో అధికారులున్నారు. మొదటి దశలో 40 జింకలను తీసుకువచ్చి వాటికి ఏర్పాట్లు చేస్తారు. వాటి సంతతి పెరిగిన కొద్దీ అవసమైన వాటిని ఇక్కడ ఉంచి, మిగతావి పులి సుస్థిర ప్రదేశానికి తరలిస్తారు. మొదటి దశలో పునరుత్పత్తి విజయవంతం అయితే ఈ పునరుత్పత్తి కేంద్రం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

**జూన్‌లో ప్రారంభిస్తాం**



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో చుక్కల దుప్పుల సంతతి పెంచేందుకు జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కాంపా స్కీం కింద రూ.83 లక్షలు మంజూరయ్యాయి. పనులు చివరి దశలో ఉన్నాయి. జూన్‌లో జింకలను తీసుకువచ్చి పునరుత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తాం.

– మాధవరావు, ఎఫ్‌డీవో, జన్నారం

### యోగా శిక్షణలో సర్టిఫికేట్ అందజేత



సర్టిఫికేట్ అందుకుంటున్న రోహిత్

మంచిర్యాలటౌన్: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఇందులో మంచిర్యాల నుంచి రెవెల్లి రోహిత్ పాల్గొని ఉత్తీర్ణత సాధించగా, మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా సర్టిఫికేట్ అందుకున్నట్లు శిక్షకుడు మంద శ్రీనివాస్ తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగాలో శిక్షణ పొంది ఉత్తీర్ణత సాధించిన రోహిత్‌ను పలువురు అభినందించారు.

### మహిళ అదృశ్యం

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని ఎల్లారం గ్రామంలో గోదుబాయి అనే మహిళ అదృశ్యమైంది. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. గోధుబాయి ఈనెల 5న ఆసిఫాబాద్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో ఆరాతీశారు. ఆచూకీ దొరకకపోవడంతో తండ్రి కొట్రంగి కొండు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి



సామగ్రి అందజేస్తున్న వరుణ్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: గిరిజన మత్స్య సహకార సొసైటీ సభ్యులు శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధిచాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో కె.వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఉట్నూర్ మండలం కోపర్‌ఘడ్, మత్తడిగూడ, జైనూర్ మండలం కోహికగూడ చెందిన మత్స్య సహకార సొసైటీ సభ్యులకు చేపలు పట్టేందుకు రూ.2లక్షల 43 వేల విలువైన ఉచిత శిక్షణ సామగ్రిని సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ చేపలు పట్టేందుకు గిరిజన మత్స్యకారులు శిక్షణ పొంది ఆదాయం పెంచుకోవాలన్నారు. సొసైటీలోని ప్రతీ సభ్యుడు శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని కోరారు. జిల్లాలో ప్రతీ సొసైటీ ఆదర్శ సొసైటీలుగా తయారు కావాలన్నారు. అన్ని సొసైటీలకు శిక్షణ అందించాలని పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో రాంబాబు, సంబంధిత సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న రాహుల్‌రాజ్

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. పలువురు గిరిజనుల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో ఒకే అర్జీదారు పలుమార్లు రాకుండా సమాధానం, వివరణ ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి కోసం నిరుద్యోగ యువత నుంచి అధికంగా దరఖాస్తులు వచ్చాయని వారికి జాబ్‌మేళా నిర్వహించాలని జేడీఎం నాగభూషణ్‌ను ఆదేశించారు. ట్రైకార్ రుణాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీడీ దిలీప్‌కుమార్, ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏరియాలో జీఎం సివిల్ పర్యటన



జీఎం సివిల్‌ను సన్మానిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): జీఎం సివిల్‌గా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ సోమవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దేవేందర్, ఇతర విభాగాల అధికారులు గోలేటిలోని జీఎం కార్యాలయంలో సూర్యనారాయణను సన్మానించి మొక్కను జ్ఞాపికగా అందజేశారు. ఏరియా జీఎం మాట్లాడుతూ సూర్యనారాయణ జీఎం సివిల్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఏరియాలో కొనసాగుతున్న సివిల్ పనులు వివరాల వారి పురోగతిపై అధికారులతో చర్చించారు. ఎస్‌వోటూ జీఎం కేహెచ్ఎస్ గుప్తా, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ సతీశ్‌బాబు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## రెడ్‌క్రాస్ సభ్యులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న రాజరమేశ్



అవార్డులు అందిస్తున్న అడిషనల్ కలెక్టర్లు



నీలకంఠేశ్వర్‌రావును సత్కరిస్తున్న అదనపు కలెక్టర్లు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలఅగ్రికల్చర్/రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్: వరల్డ్ రెడ్‌క్రాస్ డే ను పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సభ్యులకు కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్ సోమవారం అవార్డులు ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి అందించిన 18 అవార్డులను సొసైటీ స్టేట్ ప్యాట్రన్ మెంబర్ వి.మధుసూదన్‌రెడ్డికి అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. సింగరేణి వైద్యుడు, జీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రాజరమేశ్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు అందుకున్నారు. ఆర్కే 5 గని ఉద్యోగులు చేసిన సామాజిక సేవ కార్యక్రమాలకు రెడ్‌క్రాస్ ప్రశంసలు అందించింది. గని ఉద్యోగుల సమక్షంలో ఎస్టేట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్‌కు ప్రశంసాపత్రం అందించారు. గని సంక్షేమ అధికారి రణదీప్, క్లర్క్ రాజేశ్వర్‌రావు, టీబీజీకేఎస్ నాయకుడు నెల్కి మల్లేశ్ పాల్గొన్నారు.

# సాగులో 'గ్రాడ్యుయేట్'

- వినూత్న ఆలోచనతో వేసవిలో పత్తి పంట
- ఎకరాకు రూ.40 వేలు లాభం



పత్తి ఏరుతున్న కూలీలు

జన్నారం: వేసవిలో వరి పంట వేసే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఓ గ్రాడ్యుయేట్ రైతు వినూత్నంగా ఆలోచించాడు. పత్తి వేసి వరి పంట కన్నా ఎక్కువ లాభం గడించాడు. పంట మార్పిడితో భూమికి బలం చేకూరడం, పత్తి మొక్కలతోపాటు దున్నడంతో నత్రజని శాతం పెరుగుతుందని ఆ రైతు పేర్కొంటున్నాడు.

జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన పాత రాజన్న బీఎడ్ పూర్తిచేసి ఉద్యోగం రాక ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తనకు రెండెకరాల పొలం ఉంది. వర్షాకాలంలో వరి వేశాడు. వచ్చిన వరి ధాన్యం తినడానికి ఉంచుకున్నాడు. అదేవిధంగా యాసంగిలో అందరు వరి వేసుకుంటే రాజన్న మాత్రం వేసవిలో ఎకరంలో పత్తి పంట వేసుకున్నాడు. తనకున్న మోటారుతో నీరు పెట్టాడు. పత్తి ఏపుగా పెరిగింది. కాయలు బాగానే కాశాయి. దున్నడం, పత్తి విత్తనాలు, ఎరువులు, అన్ని కలుపుకుని ఇప్పటివరకు రూ.15 వేల వరకు ఖర్చయింది. ప్రస్తుతం పత్తి కాయలు పగిలి కూలీలు ఏరే పనిలో ఉన్నారు. కూలీలకు మరో రూ.2 వేల ఖర్చవుతోంది. మొదటి సారి పత్తి ఏరగా 2 క్వింటాల్ వచ్చిందని, మొత్తం ఆరు క్వింటాళ్ల చేతికి వచ్చే అవకాశం ఉందని రైతు రాజన్న చెబుతున్నాడు. ఈ లెక్కన చూస్తే ఎకరాకు రూ. 40 వేల లాభం వస్తుందని అంటున్నాడు.

**పలువురి సందర్శన**

వినూత్న పద్ధతిలో పత్తి పంట వేసిన విషయం తెలుసుకుని వ్యవసాయ శాఖ అధికారులు పంటను సందర్శించారు. గ్రాడ్యుయేట్ రైతు ఆలోచనను మెచ్చుకున్నారు. కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాలకు చెందిన పలువురు రైతులు పంటను పరిశీలించి వారు వచ్చే ఏడాది పంట వేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఎలాంటి రిస్క్ లేకుండా వరి కన్నా ఎక్కువ లాభం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

**కొత్తగా ఆలోచించా..**



వరి వేసుకుంటే అమ్ముకునే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుంది. అకాల వర్షాలకు పంట నష్టపోతున్నాం. మొదటిసారిగా కొత్తగా ఆలోచించి వేసవిలో పత్తి వేసుకున్నాను. మోటారుతో నీళ్లు పెడుతూ మూడుసార్లు ఎరువులు వేశాను. పంట బాగానే పండింది. మొదటిసారి ఏరినప్పుడు 2 క్వింటాల్ చేతికి వచ్చింది. అంత అయ్యే వరకు మరో 4 క్వింటాల్ పత్తి చేతికి వస్తుంది. అన్ని ఖర్చులు పోను రూ.35 వేలు మిగులుతాయి.

– పాత రాజన్న, రైతు

### ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

భీమిని: మండలంలోని రాంపూర్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొ న్నాయి. ఈ ఘటనలో భీమిని మండలానికి చెందిన కొట్రంగి రవికి తీవ్ర గాయాలు కాగా బెల్లంపల్లికి చెందిన సాయి, అతడి మిత్రుడికి స్వల్ప గాయాలయ్యాయి. బెల్లంపల్లిలో నిర్వహించే మంత్రి కేటీఆర్ మీటింగ్‌కు బైక్ ర్యాలీలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలైన రవిని మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ అతడికి వైద్యం అందిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

### విరబూసిన మే పుష్పం



భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లో రైతుబంధు సమితి మండల కన్వీనర్ రామరావు ఇంట్లో సోమవారం మే పుష్పం విరబూసింది. దీనిని చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. ఏటా మే నెలలో మాత్రమే ఈ పుష్పం విరబూస్తుందని రామారావు తెలిపారు.

## భార్యను హతమార్చిన భర్త అరెస్ట్



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

వాంకిడి: భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించారు. మండలంలోని దాబా గ్రామానికి చెందిన సంగీత (25), మారుతి భార్యాభర్తలు. ఇద్దరు సంతానం. కుమారుడు (5), కుమార్తె (3) ఉన్నారు. మద్యానికి బానిసైన మారుతి తరచూ భార్యతో గొడవపడేవాడు. అదే గ్రామానికి చెందిన మొహర్లే పొచ్చుతో వివాహేతర సంబంధం పెట్టుకున్నావని హింసించేవాడు. సంగీత తల్లిదండ్రులు పలుమార్లు గ్రామపెద్దల సమక్షంలో సముదాయించిన మారుతిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం మత్తులో సంగీతపై ఇంట్లో ఉన్న గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడ మృతి చెందింది. అదే సమయంలో అడ్డుకునేందుకు వచ్చిన మొహర్లే పొచ్చుపైన గొడ్డలితో దాడి చేశాడు. ఆయన తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు గాయాలతో పరుగున బయటికి వచ్చిన పొచ్చును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి తండ్రి లెండ్గూరె బాబాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ విఫలమైందని యువకుడి బలవన్మరణం



రాకేశ్ (ఫైల్)

తిర్యాణి: ప్రేమ విఫలమైందని మనస్తాపం చెంది యువకుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం..మండలంలోని తలాండి గ్రామానికి చెందిన బైరాజు రాకేశ్(29) అనే యువకుడు గత కొన్ని రోజులుగా అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. ఈ క్రమంలో ప్రేమించిన అమ్మాయితో ఇటీవల మనస్పర్థలు వచ్చి విడిపోయారు. ఆమె ఎక్కడ దూరమవుతుందోనని మనస్తాపం చెంది ఆదివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి అటు నుంచి మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి శేఖర్‌చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విపక్ష నాయకుల ముందస్తు అరెస్టులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకుని పోలీసులు విపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల శ్రేణులను ముందస్తు అరెస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అరెస్టుల పర్వం సాగింది. బీజేపీ నాయకులు కొయ్యల ఏమాజీ, మునిమంద రమేశ్, పుల్లం తిరుపతి, గోవర్ధన్, శ్రావణ్, నర్సింగ్, ఎస్‌సీపీ నాయకుడు ఎం.శ్రీనివాస్, సీపీఎం, ఇతర ప్రజా సంఘాల బాధ్యులను వాహనాల్లో ఏఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు తరలించారు. కాగా, అక్రమ అరెస్టులకు నిరసనగా నాయకులు, కార్యకర్తలు ఏఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్ ప్రధాన గేట్ ముందు ధర్నా చేశారు.

**ఎమ్మెల్యే చిన్నయ్యపై ఫ్లెక్సీలతో దుష్ప్రచారం**

మంత్రుల పర్యటనను పురస్కరించుకుని కొందరు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఫ్లెక్సీలతో దుష్ప్రచారానికి పాల్పడ్డారు. కన్నాల, రైల్వేస్టేషన్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఇటీవల వివాదమైన ఆరిజిన్ డెయిరీ వ్యవహారానికి సంబంధించిన పేపర్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తా కథనాల క్లిప్పింగ్‌లను ఫ్లెక్సీల్లో ముద్రించి కూడళ్లలో అర్ధరాత్రి కట్టారు. ఆ ఫ్లెక్సీలపై బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం అని రాసి ఉండటం గమనార్హం.